సాక్షి
కర్నూలు
మంగళవారం । 28 । జనవరి । 2025



మల్లన్నకు సహస్రదీపార్చన

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం సహస్రదీపార్చన సేవ నిర్వహించారు. ఉత్సవమూర్తులను వెండిర థంపై ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు.



నందీశ్వరుడికి పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరుడికి త్రయోదశి సందర్భంగా సోమవారం శాస్త్రోక్తంగా ఆలయ అధికారులు విశేషపూజలు చేశారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	:1,633
ప్రస్తుతం	:1,618.09
సామర్థ్యం (టీఎంసీలు)	:105.788
ప్రస్తుతం	:56.132
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:0
అవుట్ ఫ్లో	:11,136

న్యూస్‌రీల్

కుష్టువ్యాధి రహిత జిల్లాగా కర్నూలు

కర్నూలు(సెంట్రల్): కుష్టువ్యాధి రహిత జిల్లాగా కర్నూలును తీర్చిదిద్దాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా వైద్య, ఆరోగ్యశాఖాధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో స్పర్శ కుష్టు వ్యాధి అవగాహనకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 30వ తేదీ నుంచి మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని స్పర్శ కుష్టువ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఫిబ్రవరి 13వ తేదీ వరకు ప్రతి ఇంటిని సందర్శించి వ్యాధి గ్రస్తులు ఉంటే గుర్తించాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కుష్టు, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ఎల్ భాస్కర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.శాంతి కళ, జిల్లా న్యూక్లియస్ వైద్యాధికారి డాక్టర్ జి. మల్లికార్జునరెడ్డి, విజయ ప్రకాష్, వై.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వెంకాయపల్లె ఎల్లమ్మ హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ లెక్కింపును పరిశీలిస్తున్న ఈఓ

కర్నూలు(రూరల్): వెంకాయపల్లె ఎల్లమ్మ హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. ఆలయం వద్ద పోలీసులు, గ్రామ పెద్దల సమక్షంలో అధికారులు ఈ లెక్కింపు చేపట్టారు. ఇందులో మూడు నెలల కాలానికి భక్తులు సమర్పించిన కానుకల ద్వారా మొత్తం రూ.16,34,912 ఆదాయం వచ్చినట్లు వెంకాయ పల్లి ఎల్లమ్మ ఆలయ కార్య నిర్వహణాధికారి రాధాకృష్ణ తెలిపారు. ఈ ఆదాయంతో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షణాధికారి చంద్రశేఖర్ రెడ్డి, గార్గేయపురం ఏపీజీబీ మేనేజర్ ఎస్ అన్వర్, ఫీల్డ్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు, పూజారులు పాల్గొన్నారు.

అహోబిలేశుడికి నీరాజనం



పూజల్లో పాల్గొన్న భక్తులు

రుద్రవరం: మండల పరిధిలోని నర్సాపురంలో పార్వేట ఉత్సవ మూర్తులు జ్వాలా నరసింహ స్వామి, ప్రహ్లాద వరద స్వాములకు భక్తులు సోమవారం విశేష పూజలందించారు. పార్వేట ఉత్సవాల్లో భాగంగా స్వామివారి పల్లకీ గ్రామంలోని పలుకాలనీల తెలుపుల మీద కొలువుదీర్చగా ఆయా తెలుపుల యజమానులు చుట్టుపక్కల వారు పూజా సామగ్రిని స్వామికి సమర్పించి పూజలు చేశారు. పల్లకీ గ్రామంలోకి చేరుకోవడంతో పండుగ వాతావరణం నెలకొంది.

ఎంపీహెచ్‌ఏ నియామకాలపై విచారణ

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఎంపీహెచ్‌ఏ (మేల్) నియామకాలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులపై ఆ శాఖ ప్రాంతీయ అధికారి డాక్టర్ బి. రామగిద్దయ్య విచారణ చేపట్టారు. సోమవారం ఆయన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి వచ్చి ఎంపీహెచ్‌ఏ నియామకాలకు సంబంధించి 2002 నుంచి ఇప్పటి వరకు పని చేసిన సంబంధిత ఉద్యోగులను పిలిచి రికార్డులు పరిశీలించి వివరాలు సేకరించారు.

కేంద్రీయ విద్యాలయం ప్రారంభంపై కసరత్తు



ఐటీఐలో భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

డోన్ టౌన్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరవతో డోన్ పట్టణానికి మంజూరైన కేంద్రీయ విద్యాలయం ప్రారంభించేందుకు అధికారులు ముమ్మర చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం అనంతపురం కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ మార్కండేయులు డోన్‌కు వచ్చి ఆర్డీఓ నరసింహులు, జిల్లా విద్యాధికారి జనార్దన్‌రెడ్డి, డోన్ డిప్యూటీ ఈఓ, ఏడీ సుధాకర్‌రెడ్డి, ఎంఈఓ ప్రభాకర్, తహసీల్దార్ నాగమణిలతో కలిసి కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు, నూతన భవన నిర్మాణ ప్రాంతాలను పరిశీలించారు. 2025 ఏప్రిల్ నుంచి 1 నుంచి 5 తరగతులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

మళ్లీ వచ్చే పచ్చపాతం!

- ఇక నుంచి టీడీపీ కార్యకర్తలు, సానుభూతి పరులకే 'ఉపాధి'
- ఊపిరి పోసుకుంటున్న శ్రమశక్తి సంఘాలు, మేట్‌ల వ్యవస్థ
- మేట్‌లకు గౌరవ వేతనం చెల్లిస్తారట!
- చర్యలు తీసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం
- అక్రమాలను తొలగించిన గత వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం టీడీపీ నేతలు, కార్యకర్తల చేతుల్లోకి వెళ్లిపోతోంది. కరువు పీడిత ప్రాంతాల్లో వలసలు నియంత్రించాల్సిన ఈ పథకానికి రాష్ట్ర ప్రభుత్వమే తూట్లు పొడుస్తోంది. శ్రమశక్తి సంఘాలు ఏర్పాటు చేసేందుకు, మేట్‌ల వ్యవస్థ తీసుకొచ్చేందుకు చర్యలు ముమ్మరం చేసింది. ఇప్పటికే టీడీపీ నాయకులు బోగస్ మస్టర్లు సృష్టిస్తూ కూలీల పొట్టకొడుతున్నారు. 'ఉపాధి' పనులు కేవలం టీడీపీ కార్యకర్తలకు అప్పగిస్తూ అక్రమాలు చేస్తున్నారు. మళ్లీ తెరపైకి 'పచ్చ'పాతం రావడంతో జీవనం భారమై కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



జిల్లాలో జరుగుతున్న ఉపాధి పనులకు తక్కువగా వచ్చిన కూలీలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉపాధి హామీ పథకంలో 2014 నుంచి 2019 వరకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్నో అక్రమాలు చేశారు. కాంపోనెంట్ పనుల్లో రూ.100కు రూ.15 నుంచి రూ.20 వరకు ఖర్చు చేసి రూ.80 నుంచి రూ.85 వరకు స్వాహా చేశారు. మళ్లీ నాటి పరిస్థితులే పునరావృతం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లుగా తమ వారిని నియమించుకుంటున్నారు. మాట వినని ఏపీవోలు, సాంకేతిక సహాయకులు, ఈసీలను పక్కన పెడుతున్నారు. అక్రమాలకు ఆలవాలమైన శ్రమశక్తి సంఘాల ఏర్పాటుతో పాటు మేట్ వ్యవస్థను తీసుకొచ్చేందుకు చర్యలు సాగుతున్నాయి.

మళ్లీ మేట్ల నియామకం

2018–19 వరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వ్యవహారాలను టాటా కన్సల్టెన్సీ సర్వీస్(టీసీఎస్) సాఫ్ట్‌వేర్‌లో నిర్వహించే వారు. ఇది పారదర్శకంగా లేకపోవడంతో గత వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం నేషనల్ ఇన్ఫర్‌మ్యాటిక్ సెంటర్(ఎన్‌ఐసీ) సాఫ్ట్‌వేర్‌కు మారింది. దీంతో శ్రమశక్తి సంఘాలు, మేట్‌ల వ్యవస్థకు మంగళం పలికినట్లు అయింది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం పాత పద్ధతిని తెచ్చేందుకు సర్వం సిద్ధం చేసింది. శ్రమశక్తి సంఘాలను ఏర్పాటు చేయడం, వీటికి లీడర్ల ఎంపిక, కొత్త సంఘాలకు మేట్‌లను నియమించడం చురుగ్గా జరుగుతోంది. అన్నింటిలోనూ టీడీపీ కార్యకర్తలే ఉండేలా చూస్తున్నారు. ఇప్పటికే 'ఉపాధి'లో అధికారపార్టీ నేతలు సాగిస్తున్న అక్రమాలు అన్నీ, ఇన్నీ కావు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రోజుకు 70 వేల మంది వరకు వ్యవసాయ కూలీలు, చిన్న, సన్నకారు రైతులు ఉపాధి పనులకు వస్తున్నట్లు లెక్కలు ఉన్నాయి. ఇందులో 50 శాతం వరకు బోగస్ హాజరు ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఫీల్డ్ అసిస్టెంట్లు మొత్తం టీడీపీ కార్యకర్తలే కావడంతో బోగస్ అటెండెన్స్ సగానికిపైగా ఉన్నట్లు తెలుస్తోంది.

అన్నింటిలోనూ టీడీపీ కార్యకర్తలే!

కర్నూలు జిల్లాలో 3.50 లక్షల జాబ్ కార్డులు ఉండగా.. ఇందులో యాక్టివ్‌గా ఉన్న జాబ్‌కార్డులు 2.61 లక్షలు. ఈ జాబ్‌కార్డులకు చెందిన వారు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. 40 నుంచి 50 మంది కూలీలతో ఒక శ్రమశక్తి సంఘం ఏర్పాటు అవుతోంది. ప్రతి సంఘానికి ఒక లీడర్ ఉంటారు. ఈ సంఘాల లీడర్లుగా కూడా టీడీపీ కార్యకర్తలే నియమితులు కానున్నారు. ఈ ప్రక్రియ ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో చురుగ్గా సాగుతోంది. లీడర్లనే మేట్‌లుగా వ్యవహరిస్తారు. ఇప్పటికే టీడీపీ కార్యకర్తలు ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమితులై అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడుతున్నారు. ఒక గ్రామంలో ఐదారు శ్రమశక్తి సంఘాలు ఉండగా.. ప్రతి సంఘానికి ఒక మేట్ ఉంటారు. గ్రామస్థాయిలోనే టీడీపీకి చెందిన వారు ఫీల్డ్ అసిస్టెంటు ఉండగా మరో ఐదారుగురు టీడీపీ కార్యకర్తలు మేట్లుగా రానున్నారు. శ్రమశక్తి సంఘాల ఏర్పాటు, మేట్‌ల నియామకం ప్రక్రియను ఈ నెల చివరిలోపు పూర్తి చేసే విధంగా గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఫీల్డ్ అసిస్టెంట్లు, శ్రమశక్తి సంఘాల లీడర్ల ఆధ్వర్యంలోనే ఇక ఉపాధి పనులు జరుగుతాయి. టీడీపీ కార్యకర్తలకే ఇక నుంచి 'ఉపాధి' పనులు వచ్చే అవకాశం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మేట్‌లకు వేతనం !

ప్రతి శ్రమశక్తి సంఘానికి లీడర్‌గా వ్యవహరించే వారిని మేట్‌గా పేర్కొంటారు. ఉపాధి పనులకు కూలీలకు తీసుకపోయే బాధ్యత మేట్‌దే. ఈయన కూడా ఇతర కూలీలతో పాటు పని చేయాల్సిందే. కాని పని చేయడం అంటూ జరగదు. కూలీల పైన అజమాయిషీ ఉంటుంది. అయితే కూలీలతో సమానంగా వేతనం లభిస్తుంది. శ్రమశక్తి సంఘానికి లీడరుగా వ్యవహరిస్తున్నందుకు ప్రతి ఫలంగా ఉపాధి పనికి వచ్చిన ప్రతి కూలీ ప్రతి రోజు రూ.1.50 కట్ చేసి చెల్లిస్తారు. మేట్‌కు 100 రోజుల పని దినాలు పూర్తి అయితే ప్రతి కూలీ నుంచి రూ.3 కట్ చేసి మేట్‌కు గౌరవ వేతనంగా చెల్లిస్తారు. కూలీల కడుపు కొట్టి మేట్‌లను మేపుతారనే ప్రచారం జరుగుతోంది.

అక్రమాలు జరుగుతాయి



కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు టీడీపీ కార్యకర్తలకు లబ్ధి చేకూర్చే విధంగా ఉంటున్నాయి. 2014 నుంచి 2018 వరకు ఉన్న మేట్‌ల వ్యవస్థతో అనేక అక్రమాలు జరిగాయి. మళ్లీ అలాంటి అక్రమాలకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తుండటం ఆందోళన కలిగించే విషయం.

– గోపాల్, వ్యవసాయ కార్మిక సంఘం, కర్నూలు మండలం.

టీడీపీ వాళ్లకే 'ఉపాధి'



రాజకీయాలకు అతీతంగా ఉపాధి పనులు కల్పించాల్సి ఉంది. అయితే నేడు అధికార పార్టీ వారికే పనులు కల్పిస్తుండటం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. ఒక పార్టీకి మాత్రమే పనులు కల్పిస్తుండటంతో మిగిలిన వారికి 'ఉపాధి' లేక వలస పోతున్నారు.

– గట్టు భీమయ్య, పెద్దభూంపల్లి, కోసిగి మండలం

అక్రమాలు ఇలా..

అధికారులు చెప్పిన లెక్కల ప్రకారం ప్రస్తుతం రోజుకు కర్నూలు జిల్లాలో 45 వేల మంది, నంద్యాల జిల్లాలో 25 వేల మంది ఉపాధి పనులకు వెళ్తున్నారు. ఇందులో 50 శాతం వరకు బోగస్ హాజరే ఉన్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఒక పనికి 60 మంది హాజరైతే 130 మంది వరకు వచ్చినట్లు మస్టర్ వేస్తున్నట్లు తెలుస్తోంది. బోగస్ హాజరు భారీగా నమోదు అవుతున్నట్లు అధికారులకు తెలిసినా.. ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. దొంగ మస్టర్లతో వచ్చే వేతనాలు ఫీల్డ్ అసిస్టెంట్లు, టీడీపీ నేతలు చెరిసగం పంచుకుంటున్నట్లు విమర్శలు ఉన్నాయి. తాజాగా శ్రమశక్తి సంఘాలు ఏర్పాటుతో అక్రమాలు మరింత పెరిగిపోయే ప్రమాదం ఏర్పడింది. కర్నూలు జిల్లాలోని తుగ్గలి, మద్దికెర, ఆలూరు, ఆస్పరి, పెద్దకడుబూరు, కౌతాళం, దేవనకొండ, కృష్ణగిరి, కల్లూరు, ఓర్వకల్లు, కోడుమూరు, హొలగుంద, కోసిగి తదితర మండలాలు, నంద్యాల జిల్లాలో ప్రధానంగా డోన్ నియోజకవర్గంలో అక్రమాలు జోరుగా సాగుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి.

➤ 2018 వరకు ఉమ్మడి జిల్లాలో డోన్, ప్యాపిలి, పత్తికొండ, కృష్ణగిరి, తుగ్గలి, వెల్దుర్తి, ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు, కోడుమూరు, కల్లూరు, కర్నూలు తదితర మండలాల్లో పాత పనులకు మెరుగులు దిద్ది, దొంగ మస్టర్లు వేసి నిధులను కొల్లగొట్టారు. అప్పట్లో ఉపాధి పనులకు రోజుకు 50 వేల మంది హాజరైతే 3 లక్షల మంది హాజరైనట్లు మస్టర్లు వేసి నిధులను కాజేశారు. పలు మండలాల్లో పాతపనులకే మెరుగులు దిద్ది నిధులు మింగేశారు. ఒక పనికి రెండు మండలాల్లో బిల్లులు చేసుకొని నిధులను కాజేశారు. పాత చెక్‌డ్యామ్‌లకు మెరుగులు దిద్ది డోన్, తుగ్గలి మండలాల్లో బిల్లులు చేశారు. ఈ సంఘటనలకు సంబంధించి ఇప్పటికే క్రిమినల్ కేసులు కూడా నమోదయ్యాయి.

వలసలు పెరిగే ప్రమాదం



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా 'ఉపాధి' పనులు కల్పించింది. శ్రమశక్తి సంఘాలను, మేట్‌ల వ్యవస్థను రద్దు చేసింది. కూటమి ప్రభుత్వం మాత్రం టీడీపీ కార్యకర్తల కోసమే మళ్లీ శ్రమశక్తి సంఘాలను, మేట్‌ల వ్యవస్థను తీసుకువస్తోంది. దీంతో మళ్లీ వలసలు పెరిగే ప్రమాదం ఏర్పడింది.

– ఎ. నాగరాజు, కలచట్ల, ప్యాపిలి మండలం, నంద్యాల జిల్లా

దేహదారుఢ్య పరీక్షల్లో 415 మంది ఎంపిక



లాంగ్‌జంప్ పరీక్షలు పరిశీలిస్తున్న జిల్లా ఇన్‌చార్జీ ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా

కర్నూలు (టౌన్): కర్నూలు ఏపీఎస్పీ రెండవ పటాలం మైదానంలో పోలీసు అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించి కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థుల్లో సోమవారం 16వ రోజు 738 మంది బయోమెట్రిక్ పరీక్షకు హాజరయ్యారు. జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పర్యవేక్షణలో వారి సర్టిఫికెట్ వెరిఫికేషన్ తర్వాత ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్టులు నిర్వహించారు. ఇందులో అర్హత సాధించిన వారికి ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్టులు 1600 మీటర్ల పరుగు, 100 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్ పరీక్షలు నిర్వహించారు. వాటిలో 415 మంది అభ్యర్థులు ప్రతిభ కనబరిచి ప్రధాన పరీక్ష (మెయిన్స్)కు అర్హత సాధించారు. ఈ కార్యక్రమంలో హోంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి. హుస్సేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

మా భూమిని ఆక్రమించుకోవాలని చూస్తున్నారు

- రియల్టర్ కేజేరెడ్డి, ఉలిందకొండ ఎస్ఐ నుంచి రక్షణ కల్పించండి
- ప్రజా సమస్యల పరిష్కారవేదికలో బాధితురాలు బోయ వెంకటేశ్వరమ్మ ఫిర్యాదు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): 'మాకు ఉలిందకొండ గ్రామ సర్వే నంబర్లు 651/1,6512లలో 8 ఎకరాల పొలం ఉంది. దీనిని రియల్టర్ కేజే రెడ్డి ఆక్రమించుకునేందుకు ఊరిలోని కొందరిని మాపైకి గొడవకు పంపి పోలీసుస్టేషన్‌లో కేసు పెట్టించి వేధిస్తున్నారు. కేజే రెడ్డితో పాటు ఉలిందకొండ ఎస్ఐ నుంచి మా కుటుంబానికి రక్షణ కల్పించాల'ని అదే గ్రామానికి చెందిన బోయ వెంకటేశ్వరమ్మ అనే మహిళ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ డాక్టర్ బి.నవ్య, ఇన్‌చార్జ్ డీఆర్వో బీకే వెంకటేశ్వర్లు ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ..ప్రజలు సంతృప్తి పొందేలా ఫిర్యాదులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్ లాగిన్‌లో వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తగిన ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని సూచించారు. హొలగుంద మండల సర్వేయర్ తన లాగిన్‌కు 58 రోజుల క్రితం వచ్చిన అర్జీని ఓపెన్ చేసి చూడలేదని, అతనిపై చర్యలు తీసుకోవాలని సర్వే ఏడీ మునికన్నన్‌ను ఆదేశించారు. జిల్లా రిజిస్ట్రార్ లాగిన్‌లో 7 రోజుల నుంచి, కార్మిక శాఖ అధికారి లాగిన్‌లో 15 రోజుల నుంచి, ఓర్వకల్ తహసీల్దార్ లాగిన్‌లో 49 రోజుల నుంచి, డీసీసీ బ్యాంకు సీఈఓ లాగిన్‌లో 8 రోజుల నుంచి, ఏపీఐఐసీ జెడ్ఎం లాగిన్‌లో 7 రోజుల నుంచి ఒక్కో అర్జీ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఎప్పటికప్పుడు వాటిని ఓపెన్ చేసి చూసి గడువులోపు పరిష్కరించాలని లేకపోతే కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందన్నారు. సీఎంఓ గ్రీవెన్స్‌లకు సంబంధించిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

- జిల్లాలోని గోనెగండ్ల, గూడూరు, సి. బెళగల్ నందవరం మండలాల్లోని జీనియస్ గ్లోబల్ పాఠశాల విద్యార్థులను ప్రమాదకరంగా ఆటోల్లో పాఠశాలలకు రప్పిస్తున్నారని, స్కూలు బస్సులు నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి రాజేష్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.
- పెరిగిపోతున్న నిత్యావసర ధరలను నియంత్రించాలని ఐద్వా ఆధ్వర్యంలో ఆ సంఘం మహిళలు అలివేలు, అరుణ, పద్మ,ధనలక్ష్మి కోరారు.
- విశాఖ పాల డెయిరీ యాజమాన్యం అవినీతి, అక్రమాలపై ఉన్నతస్థాయి విచారణ జరపాలని కోరుతూ ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు కె.వెంకటేశ్వర్లు, జి.రామకృష్ణ కలెక్టర్‌కు విన్నవించారు.
- రోడ్డుప్రమాదంలో చనిపోయిన కర్నూలు మండలం ఉల్చాలకు చెందిన సోమేశ్వరి కుటుంబానికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డీవైఎఫ్ఐ నాయకులు కోరారు.

గీత కులాల మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ జారీ

కర్నూలు (టౌన్): గీత కులాలు, ఉప కులాలకు కేటాయించిన 10 మద్యం దుకాణాలకు సోమవారం సాయంత్రం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఆయా దుకాణాలకు కేటాయించిన రిజర్వేషన్ల ప్రాతిపదికన వచ్చే నెల 5 వ తేదీ సాయంత్రం వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ (గౌడ), ఎమ్మిగనూరు మున్సిపాల్టీ (గౌడ), ఆదోని మున్సిపాల్టీ (ఈడిగ), కృష్ణగిరి (గౌడ), ఆదోని రూరల్ (ఈడిగ), కౌతాళం (గౌడ), మద్దికెర (ఈడిగ), కోసిగి (ఈడిగ), చిప్పగిరి (ఈడిగ) ఆస్పరి (ఈడిగ) మండలాలకు ఈ షాపులు కేటాయించారు. మద్యం దుకాణాల కోసం దరఖాస్తుతో పాటు ధరావత్తు రూ. 2 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని జిల్లా ప్రోహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఎం. సుధీర్ బాబు తెలిపారు. ఆసక్తి గల వారు ఆయా మున్సిపాల్టీ, మండల కేంద్రాల్లోని ఎక్సైజ్ కార్యాలయాల్లో తమ దరఖాస్తులు అందజేయాలన్నారు. వచ్చే నెల 6 వ తేదీ దరఖాస్తులను పరిశీలించి 7 వ తేదీ ఉదయం 10 గంటల నుంచి స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా అధ్యక్షతన లాటరీ పద్ధతిలో షాపులను కేటాయిస్తున్నట్లు తెలిపారు.

అంతా ఉత్తిదే!

- పేదలకు సబ్సిడీ రుణాల పేరుతో కూటమి సర్కారు హడావుడి
- ఓపెన్ కాని ఓబీఎంఎంఎస్ వెబ్ సైట్
- బీసీ రుణాలకు తేదీలు ఖరారు చేసి వదిలేసిన వైనం
- ఎస్సీ రుణాలకు వెలువడని గైడ్ లైన్స్
- అదే దారిలోనే మైనారిటీ, గిరిజనుల రుణాల పరిస్థితి
- వైఎస్సార్‌సీపీ పాలనలో 6.97 లక్షల మందికి రూ. 2049.22 కోట్ల లబ్ధి



కర్నూలు(అర్బన్): కూటమి పాలనలో ఏదైనా హడావుడే తప్పా ఆచరణలో చూపించే పరిస్థితి లేదు. ఇందుకు సబ్సిడీ రుణాల హామీనే ఓ ఉదాహరణ. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, కాపు, మైనారిటీ వర్గాలకు ఆయా కార్పొరేషన్ల ద్వారా రుణాలు అందించి వారి ఆర్థిక స్థితి గతుల్లో మార్పు తీసుకువస్తామని పాలకులు ప్రకటించారు. ఏడునెలలవుతున్నా ఇప్పటి వరకు ఒక్కరికి కూడా రుణం ఇవ్వలేదు. కనీసం దరఖాస్తుల స్వీకరణ కూడా మొదలు పెట్టలేదు. ఈ నెల మొదటి వారంలో బీసీ వర్గాలకు రుణాలు అందించేందుకు అంతా సిద్ధమైందని, వెంటనే అర్హత గలవారు దరఖాస్తు చేసుకోవాలని కూటమి సర్కారు తేదీలు సైతం ప్రకటించింది. అయితే దరఖాస్తు చేసుకునేందుకు ఉద్దేశించిన ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్ నేటికీ ఓపెన్ కాలేదు. ఇదేందంటే ... సాంకేతిక కారణాలతో ఓపెన్ కాలేదని చెబుతున్నారు. ఇక ... ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు సంబంధించిన రుణాలకు కూడా స్పష్టత కొరవడింది. కాగా, ఉన్నత స్థానాల్లో ఉన్న మంత్రులు మాత్రం ఆయా వర్గాలకు వేల కోట్ల రూపాయలు కేటాయిస్తున్నట్లు గొప్పలు చెబుతున్నారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితి మాత్రం అందుకు పూర్తి భిన్నంగా ఉంది. వీరి ప్రకటనలు చూసి రుణాలు పొందేందుకు అర్హులైన లబ్ధిదారులు మీ సేవా కేంద్రాలు, సచివాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

బీసీ రుణాలకు తేదీలు ఖరారైనా ...

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని బీసీ, ఈబీసీ వర్గాలు రుణాలకు దరఖాస్తు చేసుకునేందుకు బీసీ కార్పొరేషన్ అధికారులు తేదీలు కూడా ప్రకటించారు. అయితే నేటి వరకు దరఖాస్తు చేసుకునేందుకు వెబ్‌సైట్ ఓపెన్ కాలేదు. కర్నూలు జిల్లాలో 1,673 మంది బీసీలు, 171 మంది ఈబీసీలకు రూ.31.85 కోట్లు అందించనున్నట్లు ప్రకటించారు. అలాగే, నంద్యాల జిల్లాలో 2,156 మంది బీసీలు, 171 మంది ఈబీసీలకు రూ.45.84 కోట్లు అందించనున్నట్లు ప్రకటించారు. అయితే, నేటి వరకు వెబ్‌సైట్ ఓపెన్ కాకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఇంకా గైడ్ లైన్స్ వెలువడలేదు. అలాగే 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 50 శాతం సబ్సిడీపై మైనారిటీ వర్గాలకు రుణాలు అందిస్తున్నట్లు రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ప్రకటించారు. అయితే, ఈ రుణాలకు సంబంధించి కూడా వెబ్‌సైట్ ఓపెన్ కానట్లు తెలుస్తోంది. ఇక గిరిజనుల రుణాలపై ప్రభుత్వం ఇంకా స్పష్టత ఇవ్వలేదు.

జగన్ పాలనలో రూ.2049.22 కోట్ల లబ్ధి

గడిచిన ఐదేళ్లలో వివిధ వర్గాల ప్రజలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రకటించి అమలు చేసిన వివిధ పథకాల ద్వారా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 6,97,147 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.2049.22 కోట్లు జమ అయ్యాయి.

ఏపీ పథకాల ద్వారా ఎంతెంతంటే ....

పథకం	లబ్ధి పొందిన వివిధ వర్గాలు	జమ అయిన మొత్తం (రూ.కోట్లలో)
వైఎస్సార్ చేయూత	1,24,045	905.80
వైఎస్సార్ ఆసరా	2,49,976	568.28
కళ్యాణమస్తు, షాదీ తోఫా	2952	23.71
జగనన్న తోడు	92,739	126.81
వైఎస్సార్ భీమా	4578	45.49
వైఎస్సార్ సున్నా వడ్డీ రుణాలు	29520 (గ్రూపులు)	140.36
జగనన్న చేదోడు	102452	102.45
వైఎస్సార్ కాపు నేస్తం	26152	39.22
ఈబీసీ నేస్తం	64733	97.10
మొత్తం	6,97,147	2049.22

గైడ్‌లైన్స్ రాలేదు



షెడ్యూల్డు కులాల సబ్సిడీ రుణాలకు సంబంధించి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశాం. ప్రభుత్వం నుంచి ఇంకా గైడ్‌లైన్స్ రాలేదు. గైడ్‌లైన్స్ వచ్చిన అనంతరం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుపోయి అప్రూవల్ తీసుకొని దరఖాస్తు చేసుకునేందుకు తేదీలను ప్రకటిస్తాం. రెండు, మూడు రోజుల్లో గైడ్‌లైన్స్ వచ్చే అవకాశాలు ఉన్నాయి.

– కె. తులసీదేవి, ఈడీ, ఎస్సీ కార్పొరేషన్

పేదలకు ఎలాంటి లబ్ధి లేదు



కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటి వరకు పేద వర్గాలకు ఎలాంటి లబ్ధి చేకూరడం లేదు. బీసీ రుణాలను చుక్కల్లో చూపిస్తున్నారు. నేటికి దరఖాస్తు చేసుకునేందుకు వెబ్‌సైట్ కూడా ఓపెన్ కాలేదు. అమ్మ ఒడిని ఎత్తేశారు, రైతు భరోసా కింద రూ.20 వేలు ఇస్తామన్నారు. అది అమలు కావడం లేదు. గత ప్రభుత్వంలో వివిధ పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు ఏదో ఒక రూపంలో లబ్ధి చేకూరింది.

-కె.ఎల్లరాముడు, బస్తిపాడు, కల్లూరు మండలం

క్లుప్తంగా

సోషల్ మీడియా యాక్టివిస్ట్ అరెస్టు

ఓర్వకల్లు: మండలపరిధిలోని పాలకొలను గ్రామానికి చెందిన సోషల్ మీడియా యాక్టివిస్ట్ రమేష్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ సునీల్ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. 'గ్రామానికి చెందిన ఓ గ్రామ సింహం దళితులను దేవాలయంలోకి రానివ్వకుండా అభ్యంతరం తెలిపారని, ఈ విషయంలో న్యాయపోరాటం చేస్తామ'ని గత నెలలో సోషల్ మీడియాలో రమేష్ పోస్టు చేశారు. దీనిపై అధికార పార్టీ నాయకులు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం అతను పనిమీద ఓర్వకల్లు నుంచి కర్నూలుకు వెళ్తుండగా అదుపులోకి తీసుకొని రిమాండుకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సర్పంచ్ తండ్రిపై టీడీపీ నేతల దాడి


బాధితుడు చెన్నయ్య

కోవెలకుంట్ల: టీడీపీ నేతల అరాచకాలు మితిమీరిపోతున్నాయి. ఒక్కోసారి సొంత పార్టీ వారిని సైతం వదలడం లేదు. మండలంలోని భీమునిపాడులో ఇలాంటి ఘటనే వాదివారం చోటుచేసుకుంది. సొంత పార్టీకి చెందిన సర్పంచ్ పూజారి ప్రదీప్‌కుమార్ తండ్రి పూజారి చెన్నయ్యపై దాడికి తెగబడ్డారు. చెన్నయ్య పంచాయతీ నిధులతో శ్మశానికి వెళ్లే రహదారి పనులు చేస్తుండగా తమను కాదని ఎలా చేస్తారంటూ టీడీపీ నేతలు సునీల్‌రెడ్డి, సుబ్బారెడ్డి దుర్భాషలాడుగూ దాడికి తెగబడ్డారు. భయభ్రాంతులకు గురైన చెన్నయ్య తన కుమారుడు సర్పంచ్ ప్రదీప్‌కుమార్‌తో కలిసి జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణాకు ఫిర్యాదు చేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని విన్నవించాచు.

సైకాలజిస్టు వైద్యుడి అదృశ్యం


వెంకటసుబ్బయ్య (ఫైల్)

ఆదోని అర్బన్: పట్టణంలోని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సైకాలజిస్టు వైద్యుడు వెంకటసుబ్బయ్య అదృశ్యమయ్యాడు. ఆయన భార్య మాధవీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ హెడ్‌కానిస్టేబుల్ శివభూషణం తెలిపారు. వైద్యుడి అక్క కుమారుడికి జాబ్ ఇప్పిస్తామని నాలుగేళ్ల క్రితం హైదరాబాద్‌కు చెందిన స్వప్న రూ.9 లక్షలు తీసుకుందని తెలిపారు. జాబ్ రాకపోవడంతో ఆ డబ్బు తీసుకురావడానికి ఈనెల 22వ తేదీన హైదరాబాద్‌కు వెళ్తున్నానని భార్యతో చెప్పి వైద్యుడు వెళ్లాడని తెలిపారు. 24వ తేదీన సాయంత్రం ఎమ్మిగనూరులో ఉన్నానని, అరగంటలో వస్తానని భార్యతో చెప్పిన వైద్యుడు అరగంట తర్వాత ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చిందని తెలిపారు. కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారన్నారు.

గుంతను పూడ్చారు

సాక్షి ఎఫెక్ట్


గుంతను పూడ్చుతున్న దృశ్యం

కొలిమిగుండ్ల: కల్వటాల ప్రధాన రహదారిలో అవుకు రిజర్వాయర్ నుంచి గ్రామాలకు నీటి సరఫరా అందించే పైపులైన్ మరమ్మతులకు గురి కావడంతో గుంతను తీశారు. రోడ్డు పక్కన గుంత ప్రమాదకరంగా ఉండేది. గుంతలో పడ్డ గోమాత శీర్షికన సోమవారం 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. పైపు లైన్ రిపేరు చేసి జేసీబీ సాయంతో గుంతలో మట్టిని వేసి, పూడ్చి వేశారు.

మల్లన్న చెంతకు మరింత సులభంగా!

- భక్తుల సౌకర్యార్థం 'వన్ స్టాప్ సొల్యూషన్' యాప్
- గమ్యం చేరాల్సిన చోటును టైప్ చేస్తే చాలు.. దూరం, డైరెక్షన్ చూపనున్న యాప్
- శిఖరేశ్వరం నుంచి యాప్‌లో క్షేత్ర పరిసరాలన్నీ అనుసంధానం
- మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో యాప్‌ను ప్రారంభించనున్న దేవస్థానం
- ఉద్యోగులకు, బ్రహ్మోత్సవ విధులకు హాజరయ్యేవారికి డిజిటల్ డ్యూటీ పాస్‌లు

శ్రీశైల మల్లన్న చెంతకు భక్తులు మరింత సులభంగా చేరుకునేందుకు.. క్షేత్ర పరిధిలోని పరిసరాలను వీక్షించేందుకు వీలుగా నూతన మొబైల్ యాప్‌ను రూపొందిస్తున్నారు. శిఖరేశ్వరం నుంచి ఎక్కడికి వెళ్లాలన్నా యాప్‌లో పొందుపరిస్తే చాలు.. దూరంతోపాటు ఎటు వెళ్లాలో చూపేలా యాప్ రూపకల్పన జరుగుతోంది. వీటితోపాటు 24 సేవలను పొందేలా ఆలయ అధికారులు యాప్‌ను తయారు చేస్తున్నారు. వచ్చే మహా శివరాత్రి ఉత్సవాల్లో యాప్‌ను భక్తులకు అందుబాటులోకి తెచ్చేలా శ్రమిస్తున్నారు.




దేవస్థానం రూపొందిస్తున్న యాప్ మోడల్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో జరిగే బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే లక్షలాది మంది భక్తులకు దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. అందులో భాగంగా ఉచిత మొబైల్ యాప్‌ను రూపొందించనుంది. ఈ మొబైల్ యాప్ ద్వారా భక్తులు ఎక్కడ ఉన్నా వారు వెళ్లాల్సిన గమ్యానికి ఎలా చేరుకోవాలి, ఎంత దూరం తదితర వివరాలతో కూడిన సమాచారాన్ని అందించనుంది. పూర్తిగా ఉచితంగా భక్తులు వినియోగించుకునేలా దేవస్థానం రూపొందించింది. ప్లేస్టోర్‌లో డౌన్‌లోడ్ చేసుకుని భక్తులు ఈ యాప్‌ను వినియోగించుకోవచ్చు. అలాగే ఈ ఏడాది నూతనంగా ఉద్యోగులకు, బ్రహ్మోత్సవ విధుల హాజరయ్యే వారికి డిజిటల్ పాసులను మంజూరు చేయనున్నారు.

ఫిబ్రవరి 19 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

శ్రీశైల మహాక్షేత్రంలో ఫిబ్రవరి 19 నుంచి మార్చి 1 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం దేవస్థానం అత్రేయా ప్రైవేట్ కంపెనీ ద్వారా వన్ స్టాప్ సొల్యూషన్ పేరుతో నూతన యాప్‌ను రూపొందిస్తోంది. ఈ యాప్‌ను ప్లే స్టోర్ నుంచి భక్తులు పూర్తి ఉచితంగా వినియోగించుకునేలా రూపొందిస్తున్నారు. ఈ యాప్‌లో భక్తులు తాము ఉన్నచోటు నుంచి తాము బస చేసే సత్రాలు, లేదా ఎక్కడికి వెళ్లాలన్నా వివరాలు టైప్ చేస్తే అక్కడికి దూరంతోపాటు, ఎటు వెళ్లాలనే సమాచారాన్ని తెలియజేయనుంది. శ్రీశైల శిఖరేశ్వరం నుంచి ఈ యాప్ ద్వారా భక్తులు వెళ్లాల్సిన ప్రదేశం చూపించేలా రూపొందిస్తున్నారు.

యాప్‌లో మరిన్ని సేవలు..

ఈ యాప్ ద్వారా 24 సేవలు పొందొచ్చు. దర్శన సమయాలు, రవాణా సౌకర్యం వివరాలు, లడ్డూ ప్రసాదం కౌంటర్లు, అన్నప్రసాద వితరణ, దర్శనం టికెట్ల కౌంటర్లు, ప్రాథమిక చికిత్స కేంద్రాలు, కళ్యాణకట్ట, టాయిలెట్స్, చెప్పుల స్టాండ్, క్లాక్‌రూం, తాగునీటి సౌకర్యం, స్వామిఅమ్మవార్ల అలంకరణలు, అత్యవసరసేవలు, పార్కింగ్, పాతాళగంగ స్నానఘట్టాలు, సేదతీరే ప్రదేశాలు, పూజల వివరాలు, వినతులు, దివ్యాంగుల క్యూలైన్, సమాచార కేంద్రాలు, సూచనలు, శ్రీశైల టీవీలైవ్ తదితర ప్రదేశాలకు ఎలా వెళ్లాలి, ఎంత దూరం అనే సమాచారాన్ని కూడా తెలుసుకునేలా యాప్ రూపొందిస్తున్నారు.

డిజిటల్ డ్యూటీ పాస్‌లు


క్యూఆర్ కోడ్‌తో అందించనున్న డిజిటల్ పాస్‌ల మోడల్

ఈ ఏడాది మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు డిజిటల్ డ్యూటీ పాసులు ఇచ్చేందుకు శ్రీశైల దేవస్థానం ప్రత్యేకంగా డిజిటల్ క్యూఆర్ కోడ్‌ను రూపొందిస్తోంది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు వచ్చే అన్ని శాఖల ఉద్యోగులు, పోలీసులకు దేవస్థానం ప్రత్యేకంగా గూగుల్‌షీట్‌ను అందిస్తుంది. అందులో ఉద్యోగుల వివరాలు నమోదు చేసి, ఫొటోను అప్‌లోడ్ చేస్తే ఆయా వివరాలను సంబంధిత అధికారులు ధ్రువీకరించిన తరువాత ఐడెంటీటీ కార్డ్స్ వస్తుంది. దానిని డౌన్‌లోడ్ చేసుకుని ప్రింట్ తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే చిన్నారులు తప్పిపోకుండా వారికి క్యూఆర్ కోడ్‌తో రిస్ట్‌బ్యాండ్‌లు అందిస్తారు. వాహనాల పాస్‌లు కూడా క్యూఆర్ కోడ్‌తో అందిస్తారు. మహాశివరాత్రి పర్వదినం రోజున శ్రీశైల దేవస్థాన ఉద్యోగుల కుటుంబ సభ్యులు స్వామిఅమ్మవార్ల దర్శనానికి వెళ్లేందుకు పాసులు కూడా డిజిటల్‌గానే అందిస్తారు. పూర్తి పారదర్శకతతో ఈ ఏడాది నూతనంగా డిజిటల్ డ్యూటీ పాసులను ఏర్పాటు చేస్తున్నారు.

కిడ్నాప్ చేశారని విద్యార్థుల డ్రామా

- పాఠశాల నుంచి ఇంటికి వెళ్లే యత్నం
- ఎమ్మిగనూరులో పోలీసులకు పట్టుబడిన విద్యార్థులు


విద్యార్థులను తీసుకెళ్తున్న పోలీసు


సమాచారం తెలుసుకుంటున్న ఎంపీడీఓ రాణెమ్మ, ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం

సి.బెళగల్: పాఠశాల నుంచి ఇంటికి వెళ్లేందుకు విద్యార్థులు ఒక డ్రామా ఆడారు. తమను కిడ్నాప్ చేశారని సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. పోలీసులు చాకచక్యంగా వ్యవహరించడంతో విద్యార్థులు క్షేమంగా పాఠశాలకు చేరారు. కోడుమూరు సీఐ తబ్రేజ్ తెలిపిన వివరాలు ఇవీ.. సి.బెళగల్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో కోసిగి మండలం జంపాపురం గ్రామానికి చెందిన నవీన్.. 7వ తరగతి బీ సెక్షన్‌లో చదువుతున్నాడు. అలాగే కర్నూలులోని బుధవారపేటకు చెందిన సూర్యతేజ 6వ తరగతి ఏ సెక్షన్‌లో చదువుతున్నాడు. వీరిద్దరూ అక్కాచెల్లి అయిన లక్ష్మి, సరస్వతిల పిల్లలు. పాఠశాలలో ఉండటం ఇష్టం లేక జంపాపురానికి వెళ్లేందుకు సిద్ధపడ్డారు. ఈ విషయం ఉపాధ్యాయులకు తెలిస్తే ఇబ్బంది పడతామని.. తమను ముఖానికి ముసుగులు వేసుకున్న కొంతమంది వ్యక్తులు క్యాబ్‌లో వచ్చి కిడ్నాప్ చేశారనే విషయం మిత్రుడు నితిన్‌కు తెలిపి పాఠశాల బయటి నుంచి పొలాల్లో వెళ్లిపోయారు. ఈ విషయాన్ని నితిన్.. పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులు సూర్యప్రతాప్‌సింగ్, అయ్యన్నకు తెలిపారు. దీంతో వారు వెంటనే పోలీస్‌లకు సమాచారం అందజేశారు. సోషల్ మీడియాలో ఎస్‌ఐ సెల్ నంబర్‌తో గురుకుల పాఠశాల ఇద్దరు విద్యార్థులు కిడ్నాప్ అంటూ కథనం హల్‌చల్ చేసింది. దీంతో కోడుమూరు సీఐ తబ్రేజ్ పాఠశాలకు చేరుకుని సంఘటన వివరాలను తెలుసుకుని గాలింపు చర్యలు చేపట్టారు. ఎంపీడీఓ రాణెమ్మ, ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం, సి.బెళగల్ సర్పంచ్ పాండురంగన్న, ఎంఈఓ - 2 ఆదామ్‌బాషా.. పాఠశాలకు చేరుకుని పాఠశాల సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కంటపడిన విద్యార్థులు..

సి.బెళగల్ గురుకుల పాఠశాల విద్యార్థులు కిడ్నాప్ అంటూ సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం అయ్యింది. మిన్నెల అనే వ్యక్తికి ఎమ్మిగనూరులో విద్యార్థులు కంటపడ్డారు. ఈ విషయాన్ని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రశేఖర్‌కు ఫోన్‌లో వీడియో కాల్ ద్వారా తెలియజేశారు. ఎమ్మిగనూరులో వ్యక్తిగత పనిపై వెళ్లిన సి.బెళగల్ పోలీస్ కానిస్టేబుల్ శ్రీనివాసులు గౌడ్‌కు విషయం తెలియడంతో ఆయన ఎమ్మిగనూరు పట్టణ పోలీస్‌లకు విద్యార్థులను అప్పగించారు. అనంతరం పాఠశాల నుంచి వెళ్లిన విద్యార్థులను పోలీస్‌లు విచారించారు. పాఠశాలలో ఉండటం ఇష్టం లేక తాము పారిపోయ్యామని తెలిపారు. దీనితో సీఐ, ఎస్‌ఐ, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను వారి తల్లిదండ్రులకు అప్పగించారు.

పాఠశాలలో ఇవీ లోపాలు..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మనబడి నాడు-నేడులో భాగంగా సి.బెళగల్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 20 నూతన మరుగుదొడ్లు నిర్మించారు. అలాగే 20 పాత మరుగుదొడ్లను మరమ్మతు చేశారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా పాఠశాల ఆవరణలో విద్యార్థుల కోసం మరో 32 కొత్త మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. వాటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో విద్యార్థులు.. పాఠశాల ప్రాంగణం దాటి బహిర్భూమికోసం సుదూరంగా వెళ్తున్నారు. మలవిసర్జనకు పాఠశాల బయటకు వచ్చి ఇలాంటి కథలకు చోటు చేసుకుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు.

రోడ్డెక్కిన వాహనదారులు

- ఎఫ్‌సీ ఇవ్వాలంటూ రహదారిపై బైఠాయింపు


అధికారులతో వాదనకు దిగుతున్న లారీ యజమానులు, డ్రైవర్లు

నంద్యాల(న్యూటౌన్): ఫిట్‌నెస్ సర్టిఫికెట్(ఎఫ్‌సీ) కోసం వాహనదారులు రోడ్డెక్కారు. సోమవారం మధ్యాహ్నం దాదాపు 100 మంది వాహన యజమానులు, డ్రైవర్లు రవాణా శాఖ కార్యాలయానికి చేరుకున్నారు. ఎఫ్‌సీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా తమ పరిధిలో లేదని అధికారులు తేల్చిచెప్పడంతో వాహన డ్రైవర్లు వాదనకు దిగారు. ఈ సందర్భంగా వాహన యజమానులు, డ్రైవర్లు మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో చలానా చెల్లించామని, గడువు ముగిసిందని అధికారులు చెప్పడం అన్యాయమన్నారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోకుండా రోడ్డు ఎక్కితే ఫైన్ అంటూ అధికారులు నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఎఫ్‌సీ సర్టిఫికెట్ ఇచ్చేంత వరకు ఇక్కడి నుంచి కదిలే ప్రసక్తే లేదన్నారు. పోలీసులు అక్కడికి చేరుకుని అధికారులు, వాహన డ్రైవర్లతో చర్చించారు. రెండు రోజుల్లోగా సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో వాహనదారులు వెనుదిరిగారు.

ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్‌లో చేయించుకోవాలి

లారీ యజమానులు, డ్రైవర్లు ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను ఆటో మేటెడ్ టెస్టింగ్ స్టేషన్‌కు వెళ్లి ఎఫ్‌సీ చేయించుకోవాలని జిల్లా రవాణా శాఖ అధికారి ఐశ్వర్యారెడ్డి సూచించారు. గత ఏడాది సెప్టెంబర్ నెలలో ప్రభుత్వం ట్రాన్స్‌పోర్ట్ వాహన యజమానులకు ఎఫ్‌సీ రెన్యూవల్ కోసం నంద్యాలలోని చాబోలు రోడ్డులో ఏర్పాటు చేసిన ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్‌కు వెళ్లాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. జిల్లా రవాణా శాఖ ఆదేశాలను ఉల్లంఘించడం డ్రైవర్లు, యజమానులకు తగదన్నారు.

విద్యార్థినిపై క్షుద్ర పూజ ప్రయోగం


లభ్యమైన లెటర్, నిమ్మకాయ, కత్తి


కాలేజీ ఎదుట ఆందోళన చేపట్టిన విద్యార్థి సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగర శివారులోని బి.తాండ్రపాడు ఎస్‌ఆర్ కాలేజీలో క్షుద్ర పూజ ప్రయోగం కలకలం సంచలనం సృష్టించింది. ఈ నెల 26వ తేదీ రాత్రి 11.30 గంటల సమయంలో హాస్టల్‌లోకి గుర్తు తెలియని వ్యక్తి ప్రవేశించి బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని చంపే ప్రయత్నం చేసినట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. ఆమె గాఢనిద్రలో ఉండగా జుట్టుకు కత్తిరించాడు. తరువాత చంపబోయే సమయంలో ఆ విద్యార్థిని నిద్రలేచి కేకలు వేయడంతో దుండగుడు పారిపోయినట్లు తెలుస్తోంది. అయితే ఆ అమ్మాయి బెడ్‌పై కిల్‌యూ అనే లెటర్, పదునైన కత్తి, రెండు భాగాలు చేసిన నిమ్మకాయ ఉండడంతో క్షుద్ర పూజ జరిగినట్లు అనుమానిస్తున్నారు. ఆ గదిలో మొత్తం ఏడుగురు విద్యార్థినులు నిద్రిస్తుండగా ఉండగా..అందులో బాగా చదివే విద్యార్థినినే టార్గెట్ చేయడం గమనార్హం. కాగా, గతంలో కూడా ఒక అమ్మాయిపై క్షుద్ర పూజలు జరిగాయని, అప్పట్లో ఆమె కళ్లు తిరిగి కింద పడిపోయిందని యాజమాన్యం వారి తల్లిదండ్రులకు చెప్పి సముదాయించినట్లు సమాచారం. ఇప్పుడు మళ్లీ కాలేజీలో క్షుద్ర పూజల ప్రయోగం జరగడంతో మిగతా విద్యార్థినులు భయాందోళనకు గురవుతున్నారు.

తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వని కళాశాల యాజమాన్యం...

కాగా.. క్షుద్ర పూజల సంఘటనపై బాధిత విద్యార్థిని తల్లిదండ్రులకు యాజమాన్యం సమాచారం ఇవ్వలేదు. అయితే తోటి విద్యార్థులు కొందరు విషయాన్నివారి తల్లిదండ్రులకు తెలియజేయడంతో వారు సోమవారం కాలేజీకి చేరుకొని ఆందోళన చెందారు. యాజమాన్యాన్ని సమాచారం అడిగిన సరైన సమాధానం ఇవ్వలేదు. ఈవిషయాన్ని విద్యార్థి, మహిళా సంఘాలు తెలుసుకొని కాలేజీ ఎదుట ఆందోనకు దిగాయి.

అస్తవ్యస్తంగా హాస్టల్ నిర్వహణ...

ఎస్‌ఆర్ కాలేజీకి అనుబంధంగా ఉండే హాస్టల్ నిర్వహణ అస్తవ్యస్తంగా ఉన్నట్లు తెలుస్తోంది. కాలేజీలో మహిళా సెక్యూరిటీ గార్డులు ఉండాల్సి ఉన్నా ఉండడంలేదు. కాలేజీలో ఎక్కడా సీసీ కెమెరాలు లేవు. అంతేకాక మహిళా వార్డెన్‌లు కూడా లేరని చెబుతున్నారు. అయినా యాజమాన్యం మాత్రం విద్యార్థినుల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదనే ఆరోపణలు ఉన్నాయి.

ఆర్‌ఐఓ విచారణ..

ఎస్‌ఆర్ కాలేజీలో అమ్మాయిపై క్షుద్రపూజల కలకలం నేపథ్యంలో ఆర్‌ఐఓ గురవయ్యశెట్టి విచారణచేపట్టారు. ఆయన కాలేజీకి చేరుకొని బాధిత విద్యార్థిని, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. మరోవైపు కాలేజీ యాజమాన్యం కేసు నమోదు చేయాలని విద్యార్థి సంఘాలు తాలూకా పోలీసులను ఆశ్రయించారు. అయితే ఇంతవరకు కేసు నమోదుకాలేదు.

బరితెగించిన తమ్ముళ్లు

- బసలదొడ్డి రేషన్ దుకాణంలో బియ్యం దింపకుండా అడ్డుకున్న వైనం


పోలీసు, రెవెన్యూ సిబ్బంది సమక్షంలో తీసుకెళ్తున్న రేషన్ బియ్యం

పెద్దకడబూరు: తెలుగు తమ్ముళ్లు బరితెగించారు. ప్రభుత్వ అండతో దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. పెద్దకడబూరు మండలం బసలదొడ్డి గ్రామంలో డీలర్‌షాపును లాక్కునేందుకు యత్నిస్తున్నారు. ఇందులో భాగంగా సదరు డీలర్‌పై అధికారులకు ఫిర్యాదులు చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారు.తాజాగా వచ్చేనెల పంపిణీకి సంబంధించి దుకాణానికి వచ్చిన బియ్యాన్ని కూడా దింపకుండా అడ్డుకున్నారు. బసలదొడ్డి గ్రామంలో దాదాపు 30 సంవత్సరాలకు పైగా పర్మినెంట్ రేషన్ షాపు (నెంబర్ – 13) ఉంది. అయితే, ఈ షాపు డీలర్ కృష్ణారెడ్డిపై స్థానిక అధికార పార్టీ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తూ అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. ఈ క్రమంలో కొద్ది రోజుల క్రితం ఆర్‌ఐ తనిఖీ చేసి దుకాణంలో బియ్యం తక్కువగా ఉందని 6ఏ కింద కేసు నమోదు చేశారు. సోమవారం నోటీసు జారీ చేశారు. అందులో ఈ నెల 31 తేదీలోపు ఆర్డీఓను వ్యక్తిగతంగా కలిసి వివరణ ఇవ్వాలని ఉంది. అయితే, సోమవారమే దుకాణానికి బియ్యం స్టాక్ వచ్చింది. ఆర్ఓ(రిలీజ్ ఆర్డర్)లో డీలర్ కృష్ణారెడ్డి పేరు ఉండడంతో బియ్యాన్ని షాప్ నెంబర్ 13లోనే దింపుతున్నారు. అర లోడు దింపిన తరువాత స్థానిక తెలుగు తమ్ముళ్లు అక్కడికి చేరుకొని బియ్యం దింపరాదని వాగ్వాదానికి దిగారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఏఎస్‌ఐ శివరాములు, ఆర్‌ఐ జెర్మియా సంఘటనా స్థలానికి చేరుకుని వారితో మాట్లాడారు. తెలుగు తమ్ముళ్లు ఒప్పుకోకపోవడంతో స్టాక్ మొత్తాన్ని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొని స్థానిక సచివాలయంలో దించారు. తనకు సస్పెండ్ ఆర్డర్‌రాలేదని, నోటీసు మాత్రమే వచ్చిందని డీలర్ కృష్ణారెడ్డి తెలిపారు. కావాలని తనను అధికారపార్టీ నాయకులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు.

రెండు లారీలు ఢీ– నలుగురు మృతి

- కర్నూలు, నంద్యాలవాసులకు తీవ్ర గాయాలు
- కర్నూలువాసి మృతి
- తమిళనాడులో ప్రమాదం


ప్రమాద స్థలంలో నుజ్జయిన లారీలు

హోసూరు: తమిళనాడులోని క్రిష్ణగిరి జిల్లా బర్గూరు సమీపంలో రెండు లారీలు ఢీకొన్న ప్రమాదంలో నలుగురు దుర్మరణం చెంది ముగ్గురు గాయపడ్డారు. అలాగే 34 పశువులు చనిపోయాయి. మహారాష్ట్ర రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్ నారాయణన్ (45) ఉల్లిపాయల లోడును తీసుకొని చెన్నై కోయంబేడుకు బయల్దేరాడు. అలాగే ఆంధ్రప్రదేశ్ నుంచి 40 పశువులను లారీలో తీసుకొని కోయంబత్తూరుకు వెళ్తున్నారు. క్రిష్ణగిరి జిల్లా బర్గూరు వద్ద సుమారు సోమవారం ఉదయం 5.45 గంటల ప్రాంతంలో ఉల్లిపాయల లారీ డ్రైవర్ నారాయణన్ నిర్లక్ష్యంగా నడుపుతూ పశువుల లారీని ఎదురుగా ఢీకొన్నాడు. రెండు లారీలు నుజ్జునుజ్జయ్యాయి. నారాయణన్, మరో లారీ డ్రైవర్ దిండుగల్‌వాసి అరుణ్ జోషి (54), రెండో డ్రైవర్ మణిగంటన్ (35)లు ఘటనా స్థలంలోనే మరణించారు. పశువుల లారీలో ఉన్న నంద్యాలకు చెందిన వ్యాపారులు రాజేష్ (31), ఖాదర్ భాషా (56), విజయ్‌బాబు (38), ఉల్లిపాయల లారీలో ఉన్న కర్నూలుకు చెందిన విజయ్‌బాబు (54) లు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు అంబులెన్సులను పిలిపించి క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా విజయ్‌బాబు మృతి చెందాడు. లారీలో ఉన్న 40 పశువుల్లో 34 పశువులు గాయాలతో మృతిచెందాయి. బర్గూరు పోలీసులు వాహనాలను పక్కకు తొలగించి, కేసు నమోదు చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ల అవినీతిపై రహస్య విచారణ

డోన్ టౌన్: అర్హులైన రైతులకు దక్కాల్సిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను అధికారులు, సిబ్బంది కుమ్మక్కై అర్హత లేని రైతులకు కట్టబెట్టి అడ్డదారిలో అందినకాడికి దోచుకున్న వైనంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. తిరుపతి నుంచి వచ్చిన విద్యుత్‌శాఖ అధికారులు సోమవారం రహస్యంగా విచారణ చేశారు. డోన్ సబ్ డివిజన్ పరిధిలోని కృష్ణగిరి మండలంలో నాలుగేళ్ల క్రితం కొంతమంది రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల కోసం డబ్బు చెల్లించారు. అయితే వారికి మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్లను విద్యుత్‌శాఖ సిబ్బంది ఇతరులకు బిగించి సొమ్ము చేసుకున్న వైనం అప్పట్లో పలు వార్తా పత్రికల్లో కథనాలు ప్రచురితం కావడంతో కాటం రాజు, లాజర్, జనార్దన్‌నాయుడు, ధనుంజయతోపాటు మరి కొంత మంది సిబ్బందిని బాధ్యులను చేస్తూ అధికారులు సస్పెండ్ చేశారు. వారు తిరిగి మూడు నాలుగు నెలల తరువాత విధుల్లో చేరి పని చేస్తున్నారు. అయితే అప్పట్లో జరిగిన అవినీతి బాగోతంపై సోమవారం డోన్ డీఈఈ కార్యాలయంలో తిరుపతి నుంచి వచ్చిన ఎంక్వయిరీ విభాగం ఎస్‌ఈ కృష్ణారెడ్డి, సీనియర్ పర్సనల్ అధికారి బృందం సభ్యులు విచారణ చేపట్టారు. కాగా ఈ విషయంపై విలేకరులకు కూడా ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

విద్యార్థుల ఆత్మహత్యలు పట్టవా?

- నారాయణ, చైతన్యలకు కూటమి ప్రభుత్వం తొత్తుగా మారింది
- కలెక్టరేట్ ఎదుట వామపక్ష విద్యార్థి సంఘాలు ధర్నా


కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వామపక్ష విద్యార్థి సంఘాలు

కర్నూలు(సెంట్రల్): నారాయణ, శ్రీచైతన్య విద్యాసంస్థలకు కూటమి ప్రభుత్వం తొత్తుగా మారిందని, ఫీజుల కోసం ఆ విద్యా సంస్థలు విద్యార్థులను బలి తీసుకుంటున్నా పట్టించుకోవడం లేదని వామపక్ష పార్టీల అనుబంధ విద్యార్థి సంఘాల నాయకులు మండిపడ్డారు. సోమవారం కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్, పీడీఎస్‌యూ, ఏఐడీఎస్‌ఓ, ఏఐఎస్‌ఏ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ.. శ్రీచైతన్య, నారాయణ విద్యాసంస్థలు ఫీజుల కోసం విద్యార్థులపై నిరంతరం ఒత్తిడి చేస్తున్నాయన్నారు. దీంతో తోటి విద్యార్థుల ముందు తలెత్తుకోలేక కొందరు ప్రాణాలను బలి తీసుకుంటున్నారన్నారు. ఇటీవల అనంతపురంలో జరిగిన ఘటనే ఇందుకు ఉదాహరణ అన్నారు. విద్యార్థుల ఆత్మహత్యలు జరిగితే సంబంధిత యాజమాన్యాలపై కేసులు నమోదు చేయాలని, అప్పుడే వారిలో మార్పు వస్తుందన్నారు. మరోవైపు కూటమి ప్రభుత్వం నారాయణ విద్యాసంస్థలకు ఇంటర్ బోర్డును కేరాఫ్‌గా మార్చిందన్నారు. ఏకంగా నారాయణ కళాశాలల ప్రిన్సిపాళ్లకు బోర్డులో చోటు కల్పించడం ఘోరమన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, ఏఐఎస్‌ఏ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, ఏఐడీఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు హరీష్‌కుమార్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మహేంద్ర పాల్గొన్నారు.

కులుమాలలో దూడల ప్రదర్శన


దూడలను ప్రదర్శిస్తున్న దృశ్యం

గోనెగండ్ల: మండల పరిధిలోని కులుమాల గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో సోమవారం దూడల ప్రదర్శన, పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశు సంవర్ధకశాఖ ఉప సంచాలకులు డాక్టర్ భూపాల్ రెడ్డి మాట్లాడుతూ పశువులకు వ్యాధులు సోకినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స చేయించాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చనిపోయే ప్రమాదం ఉందన్నారు. అనంతరం దూడలను ఆరోగ్యంగా ఉంచిన యజమానులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా ఉప సంచాలకులు డాక్టర్ దుర్గా ప్రసన్నబాబు, జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఉప సంచాలకులు డాక్టర్ రాజశేఖర్, గోనెగండ్ల సహాయ సంచాలకులు డాక్టర్ వెంకటేశ్వర్లు, మహమ్మద్ అలీ పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం


మాట్లాడుతున్న ఈఎస్ రవికుమార్

బొమ్మలసత్రం: జిల్లాలో 11 మద్యం దుకాణాల ఏర్పాటుకు ఆసక్తి ఉన్న ఈడిగ, గౌడ్, గౌడ కులస్తులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ సూచించారు. సోమవారం స్థానిక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో నూతనంగా ఏర్పాటు కాబోతున్న 11 మద్యం దుకాణాలకు ఫిబ్రవరి 5 వరకు ఆన్‌లైన్‌లో కాని ఆఫ్‌లైన్(స్థానిక ఎక్సైజ్ పోలీస్టేషన్లలో)లో కానీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ. 2 లక్షల నాన్‌రిఫండబుల్ నగదును చెల్లించాలన్నారు. ఫిబ్రవరి 7న కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఆధ్వర్యంలో లక్కీడిప్ ద్వారా దుకాణాలు కేటాయిస్తామన్నారు.